కథ

# స్పృహ

డా॥ కోగంటి విజయలక్ష్మి

ఉదయం ఎనిమిది గంటలయింది.

రమేష్ తన గదిలో కూర్చుని ఏవో ఫైల్స్ తిరగేస్తున్నాడు.

ఇంతలో హఠాత్తుగా బయట కలకలం వినిపించింది. రాకింగ్ ఛైర్‌లో వెనక్కి వంగి విండో కర్టెన్స్ తొలగించి బయటకు దృష్టి సారించాడు. తమింటికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పదిహేను సంవత్సరాల పిల్లలు గుంపుగా చేరి అరుస్తూ చిన్న చిన్న రాళ్ళు విసరసాగారు.

కాసేపటికి కీచుమంటూ అరుస్తూ ఓ స్త్రీ ఆ గుంపు విసిరే రాళ్ళని తప్పించుకుంటూ అటూ ఇటూ పరుగెత్తసాగింది. ఆ స్త్రీ పరుగెత్తుతున్న కొద్దీ రెట్టింపు ఉత్సాహంతో రాళ్ళు విసరసాగారు ఆకతాయిలు.

ఆ దృశ్యం చూస్తూనే రమేష్ నిటారుగా అయ్యాడు. 'అదేమిటి ఆమెని వాళ్ళలా కొడుతున్నారు?' అనుకుంటూ చకచక లేచి బయటకు వచ్చి ఆ గుంపుని సమీపించాడు. రమేష్‌ని చూడగానే వాళ్ళంతా మౌనం వహించారు.

రమేష్ ఆ స్త్రీ వైపు దృష్టి సారించాడు. అతన్ని చూడగానే గోడవార్న ముడుచుకునుండిపోయిందామె.

రమేష్ ఆమె వంక పరిశీలనగా చూశాడు. సుమారు ముప్ఫై సంవత్సరాలుంటాయామెకి. ఛామన చాయ, లావూ, సన్నం కాని తీరయిన విగ్రహం. గుండ్రని ముఖం, కలలు కంటున్నట్లున్న కళ్ళు, పొడవాటి ముక్కు, ఆమె కట్టుకున్న లేత పచ్చరంగు చీర అక్కడక్కడా చిరుగులు, మాసికలతో ఉంది. రమేష్ క్షణకాలం కళ్ళు తిప్పుకోలేనట్లు చూస్తూండిపోయాడు.

"ఏమిటి? ఏమయింది?!" అన్నాడు. "పిచ్చి దంకుల్... మా అరుగు మీద కూర్చుని పెద్దగా పాటలు పాడుతోంది. మేమే తరుముకు వచ్చాం..."

రమేష్‌కి మతిపోయింది. 'ఈమె పిచ్చిదా!' మనసు ఆర్ద్రతతో నిండిపోయింది..

'ఏ ఇంటి ఆడపడుచో... కలవారింటి స్త్రీలాగే ఉంది.'

"తప్పు బాబూ! అలా కొట్టకూడదు. తన దారిన తాను పోతుందిలెండి. మీరంతా వెళ్ళిపొండి" అందర్నీ పంపించేసి రమేష్ వెనుదిరిగి ఇంట్లోకి వచ్చేసాడు. వంటింట్లోకి నడిచి స్టౌ వెలిగించి, కుక్కర్ పెట్టాడు. షేవ్ చేసుకుని బాత్‌రూంలోకి నడిచాడు. స్నానం, పూజ ముగించుకుని, అన్నం వడ్డించుకుని తిన్నాడు.

తొమ్మిదిన్నరకల్లా ఫ్లాట్ తాళం బిగించి, కార్ స్టార్ట్ చేసుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు. ఆంధ్రాబ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా చేస్తున్నాడతను.

గాఢ నిద్రలో ఉన్న రమేష్ ఉలిక్కిపడిలేచాడు. రేడియమ్ డయల్ అర్ధరాత్రి రెండుగంటలు చూపిస్తోంది. బయట నుంచి స్త్రీ ఆర్తనాదం. ఆ కేకకే తాను మేల్కొన్నానని గ్రహించి దిగ్గున లేచాడు. కరంట్ ఆఫ్ అయింది. మంచం పక్క టీపాయ్ మీదున్న బ్యాటరీ లైటు తీసుకుని స్విచ్ వేశాడు. బయటకు నడిచి వరండాలో నిలబడ్డాడు. అంతా నిశ్శబ్దం! చుట్టు పక్కలంతా ఒకసారి లైటు ఫోకస్ చేసాడు. అంతా నార్మల్. రమేష్ వెనుదిరిగి గుమ్మంలోకి నడిచాడు.

"కెవ్వ్వ్వ్..."

మళ్ళీ అదే ఆర్తనాదం. రమేష్ రివ్వున వెనుదిరిగాడు. ప్రహరీ గోడమీదుగా లైటు ఫోకస్ చేసి చప్పుడు వినవచ్చిన వైపు చూశాడు. ముగ్గురు అగంతకుల చేతిలో ఓ స్త్రీ పెనుగులాట. లైటు కాంతికి తత్తరపడి కాలికి బుద్ధి చెప్పారా ముగ్గురూ!

రమేష్ గబగబా అటుకేసి నడిచాడు. లైటు వెలుగులో ఆ స్త్రీ భయంతో వణుకుతూ కన్పించింది. రమేష్‌ని చూసి పెద్దగా కేక వేసింది.

రమేష్‌కి పరిస్థితి అర్ధమయింది. ఆమె పొద్దున పిల్లలు రాళ్ళతో కొట్టిన స్త్రీయే!

"నీ పేరేమిటి?" నెమ్మదిగా అడిగాడు రమేష్.

ఆమె బదులు చెప్పలేదు.

"సరే! లోపలకు రా పడుకుందువు గానీ!"

"... ... ...

అకలేస్తోందా?"

"నాతో వస్తే అన్నం పెడ్తాను. మంచి దుప్పటి, పక్కా ఇస్తాను. బాగా నిద్రపోవచ్చు."

.........

"లే! నాతోరా..." ఇక లాభం లేదని వంగి రెక్క పట్టుకున్నాడు. ఆమె కీచుమంటూ అరిచింది. రమేష్ ఒక్క నిమిషం చుట్టూ చూశాడు. ఎవరన్నా చూస్తే?" దీర్ఘంగా ఆ స్త్రీ వంక చూసి చటుక్కున ఆమె నోరు గట్టిగా నొక్కి రెండో చేత్తో జబ్బ పట్టుకుని లేపాడు. నోరు అలాగే నొక్కిపట్టి భుజాన వేసుకుని చక చక తన ఇంటివైపు నడిచాడు. గుమ్మంలోపలకి నడిచి చటుక్కున డోర్ లాక్ చేశాడు.

భుజం మీంచి దింపి ఆమెని డ్రాయింగ్ రూంలో ఉన్న దివాన్ కాట్ మీద పడుకోబెట్టి ఆమె నోటి మీద చెయ్యి తీసేశాడు. అరుస్తూ లేచి కూర్చుందామె. హఠాత్తుగా బెడ్‌లైట్ వెలిగింది. పవర్ వచ్చింది. రమేష్ స్విచ్చాన్ చేశాడు. కాంతి గదంతా పరుచుకుంది. రమేష్ కళ్ళార్పకుండా ఆ కాంతిలో ఆమెని చూశాడు. గట్టిగా నిట్టూర్చి, ఫ్రిజ్ తీసి, ఏపిల్ కోసి ముక్కల్ని ఆమె నోటికందించాడు.

అపురావుమంటూ తినసాగిందామె. రమేష్ ఒక్కో ముక్కా అలా అందిస్తూనే ఉన్నాడు. కాయ అయిపోయింది. ఇంకా కావాలన్నట్లు రమేష్ వంక చూసిందామె. ఒక్క నిమిషం ఆమెని చూసి కిచెన్‌లోకి నడిచి, రాత్రి తినగా మిగిలిన అన్నం ఒక గిన్నెలోకి తీసి పెరుగు కలిపాడు. అరటిపండు వలిచి దాంట్లో పెట్టి తెచ్చి ఆమె ముందుంచాడు.

గిన్నె మీద కలబడి గబగబా తినసాగింది. అంతా అయిపోయాక చెయ్యి నాకుతూ ఉండిపోయింది. రమేష్ మంచినీళ్ళిచ్చి చెయ్యి కడిగించాడు. ఆమె ముడుచుకుని కూర్చుంది.

"పడుకో..."

పడుకుందామె. రమేష్ లోపల్నుంచి ఓ పాత దుప్పటి తెచ్చి కప్పాడు. కాస్సేపట్లో ఆమె నిద్రాదేవి ఒడిలోకి చేరిపోయింది.

మర్నాడామెని తీసుకెళ్ళి మెంటల్ హాస్పిటల్లో జాయిన్ చెయ్యాలని అనుకుంటూ నిద్రలోకి జారిపోయాడు రమేష్.

* * * *

తెల్లారి లేచి బెడ్ కాఫీ తాగుతూ పేపరు తిరగేయసాగాడు.

'పిచ్చాస్పత్రిలో వార్డ్‌బాయ్‌ల అఘాయిత్యం' అన్న శీర్షిక దగ్గరతని చూపులు ఆగిపోయాయి. గబగబా వార్త చదివాడు. హాస్పిటల్లో ఆడ ఇన్‌పేషెంట్ల మీద వార్డుబాయ్‌ల దురాగతం. సభ్య సమాజం తల దించుకునే రీతిలో మతిస్థిమితం లేని స్త్రీలపై మెంటల్ హాస్పిటల్లో యథేచ్ఛగా మానభంగాలు జరుగుతున్న వైనమది. వార్డ్‌బాయ్‌లు మొదలు మేల్ నర్సుల వరకూ చేస్తున్న ఈ నీచపు పనులు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని కష్టడీలోకి తీసుకున్నారు.

రమేష్‌కి మతిపోయింది. ఈమెని మెంటల్ హాస్పిటల్లో చేర్పిస్తే తన పని అయిపోతుందనుకున్నాడు. కానీ, అక్కడా రక్షణ లేని పరిస్థితులే! ఇప్పుడేం చెయ్యాలి! లేచి అన్యమనస్కంగానే పనులన్నీ ముగించుకోసాగాడు.

ఇంతలో రమేష్ దృష్టినాకర్షించింది ఆమె పొట్ట. ఉబ్బెత్తుగా కనిపిస్తుందక్కడ. ఉలిక్కిపడ్డాడతను.

'ఒకవేళ ఈమె ప్రెగ్నెంటా?'

అదే నిజమయితే ఈమె ఉన్న పరిస్థితిలో డెలివరీ, బిడ్డపెంపకం ఇదంతా ఎలా జరుగుతుంది? అతనిలో ఏవో ప్రకంపనలు. నో అలా జరగడానికి వీల్లేదు. ఆలోచనలతో కొట్టుమిట్టాడుతున్నాడతను.

ఆమె ఇల్లంతా కలియదిరుగుతోంది.

రమేష్ వెళ్ళి టూత్‌పేస్టిచ్చి పళ్ళు తోముకోమన్నాడు. బుద్ధిగా ముఖం కడుక్కువచ్చింది. ఉప్మా కాఫీ ఇచ్చాడు. బుద్ధిమంతురాలిగా అన్నీ చెప్పినట్టు చేసింది.

"నీ పేరేమిటి?"

ఆమె సమాధానం చెప్పకుండా నవ్వింది.

"మీ వాళ్ళెవరో చెప్పు. అక్కడికి తీసుకెళ్తాను,"

"నేనెక్కడికీ వెళ్లను. నీ దగ్గరే ఉంటా. నువ్వు మంచోడివి"

రమేష్ తీవ్రంగా ఆలోచించాడు.

"సరే! స్నానం చెయ్యి" అన్నాడు.

ఆమె బాత్‌రూంలోకి వెళ్ళింది. కాస్సేపటికి బాత్‌రూంలోంచి- "ఇదిగో నాకు బట్టలివ్వు....." అంటూ కేకపెట్టింది. రమేష్‌కి ఏం చెయ్యాలో తోచలేదు. టవల్ తెచ్చి లోపలికి విసిరేశాడు.

"తుండు కాదు! చీర, జాకెట్ కావాలి."

"సరే! అయితే, ముందు నువ్వా టవల్ చుట్టుకునుండు! నేను పదినిమిషాల్లో వస్తా.." అంటూ గబగబా కారేసుకుని బయలుదేరాడు.

పదిహేన్నిమిషాల తర్వాతే-

"ఊఁ.. ఇవిగో నీక్కావలసినవి.." అంటూ ఓ ప్యాకెట్ అందించాడు. ఆమె శుభ్రంగా బట్టలు కట్టుకుని ఇవతలకు వచ్చింది.

"తల దువ్వుకో" దువ్వెన అందించాడు.

దువ్వెన్నందుకుని చక్కగా తల దువ్వుకుంది. దేవుడి దగ్గర కుంకుమ భరిణె చూపాడు. అద్దంలో

చూసి బొట్టు దిద్దుకుంది. ఏదో నిశ్చయానికొచ్చినట్లు రమేష్ లేచి తన పళ్లన్నీ కానిచ్చి డ్రస్సప్ అయి వచ్చాడు. తలుపులన్నీ లోపల్నుంచి బిగించి బయటకు నడిచాడు.

"రా వెళదాం" అన్నాడు.

బుద్ధిగా అనుసరించిందామె.

రమేష్ ఆమెని కారెక్కించుకుని బయలుదేరాడు.

"డా॥ సుజాత, గైనిక్" అన్న బోర్డు చూసి కారాపాడు. ఆమెని తీసుకుని లోపలికి నడిచి-

"డాక్టర్! మీరొకసారి ఈమెని టెస్టుచేయాలి..." అన్నాడు.



"అలాగే! రామ్మా!" అంటూ లేచింది.

ఆమె కదలకుండా డాక్టర్ని చూస్తూండిపోయింది.

"వెళ్ళు.." కాస్త కరుగ్గా అన్నాడు రమేష్.

ఆమె భయపడినట్టు చూస్తూ లేచి డాక్టర్ వెంట నడిచింది. కాస్సేపటికి డాక్టర్ బయటికొచ్చింది.

"ఆమెకి నాలుగో నెల..."

రమేష్ అనుమానం నిజమయింది. ఆలోచించి ఒక్క నిమిషంలో ఓ నిర్ణయానికి వచ్చి-

"డాక్టర్! మాకింతకుముందు ఇద్దరు పిల్లలున్నారు. తనకి మతిస్థిమితం లేదు. ఎబార్షన్ చేయించాలనుంది."

"ఇంతవరకూ ఏం చేసారు. ఆల్రెడీ మూడు నిండిపోయింది అంటే ఎబార్షన్ కష్టం"

"ఒక పని చెయ్యండి. యూట్రిస్ రిమూవ్ చేసేయండి"

"ఊఁ! అదే మంచి పని. ఎప్పుడు జాయిన్ చేస్తారు?"

"ఎప్పుడో ఎందుకు? ఇప్పుడే ఎడ్మిట్ చేసుకోండి. నేనింటికెళ్ళి కావల్సినవన్నీ తెచ్చుకుంటాను"

"ఓకే! రేపుదయం ఆరు గంటలకు ఆపరేషన్ చేస్తాను"

అప్పటికప్పుడు ఒక రూమ్ తీసుకుని అందులో ఆమెనుంచాడు. సాయంత్రం దాకా తనూ అక్కడే ఉండి అన్నీ చూస్కోసాగాడు.

ఆమె పిచ్చిదే కాని అల్లరి చేయదు. అది కొంతవరకూ మంచిదయ్యింది. మర్నాడు ఆపరేషన్ అయి రూంలో తెలివి లేకుండా ఉంది ఆమె.

రమేష్ ప్రక్క కుర్చీలో కూర్చుని ఆమె వంక చూస్తున్నాడు. తను చేసిన ఉపకారం ఆమెకి జన్మంతా రక్షణ నిస్తుందా?

వారం రోజులు ఆమెని కంటికి రెప్పలా కాపాడాడు. కుట్లు విప్పి మర్నాడు ఇంటికి తీసుకెళ్ళ వచ్చన్నారు డాక్టర్.

* * * *

రమేష్ మర్నాడు హాస్పిటల్‌లోకి వచ్చేసరికి డాక్టర్, నర్సులు అంతా కంగారుపడుతూ అటు ఇటూ తిరుగుతున్నారు.

రమేష్‌ని చూడగానే డాక్టర్ చిన్నబుచ్చుకుంది.

"సారీ సర్! మీ మిసెస్ కనిపించడం లేదు"

రమేష్ స్థాణువై పోయాడు. చేసే దేం లేక ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని బయట పడ్డాడు.

తనిప్పుడు ఆ పిచ్చి దానికి చేసిందాని వల్ల ఉపకారం జరిగినట్లేనా? అని ప్రశ్నించుకున్నాడు.

'అవును!' అంది అంతరాత్మ.

ఆమె మళ్ళీ ఏ కాముకుడికో బలయి గర్భవతయితే ఆ తర్వాత జీవితం ఆమెకెలా ఉంటుంది? ఏ చెట్టుకిందో డెలివరీ అయి, బిడ్డని వదిలేసి ఎటో పోవడం.. ఇలా ఆమె అనాధ పిల్లల్ని ఈ లోకానికి అందిస్తూనే జీవితం ముగుస్తుంది. దానికంటే తను చేసిన పనివల్ల అనాధ పిల్లల జన్మల్ని ఆపగలిగాడు.

ఏ జన్మల పాపమో తల్లీ తండ్రీ లేక, అనాధగా బిచ్చగాళ్ళకి దొరికి, జనుల నుంచి మరింత సానుభూతి పొంది దండిగా ధర్మాలందు కోవటానికి తన ఒక కాలు విరిచేసి అవిటి వాణ్ణి చేసారు. సంకల్పబలంతో ఎదిగి అవిటి జీవితానికి కృంగిపోక ఈ స్థాయికి ఎదిగాడు తను.. మళ్ళీ మరో అనాధ.. అదీ తనకి తెల్సి ఈ కుత్సితం నిండిన నేల మీదికి రావడం తను ఆపగలిగాడు. ఇది ఎంతవరకు సమంజసమో తెలియకపోయినా.. అమ్మలేక ప్రతిక్షణం చెమ్మగిల్లిన జీవితం గడపబోయే చిన్నారికి మంచేచేసుంటా" అనుకుని తన కృత్రిమకాలుని నిర్వికారంగా చూసుకుంటూ కారెక్కాడు రమేష్.